క్లుప్తంగా

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధమవ్వాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: త్వరలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల పట్ల విద్యార్థులు భయాందోళన చెందకుండా, ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమైతే విజయం తథ్యమని సమగ్రశిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి రమేష్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. పట్టుదల, సమయపాలన, పునఃశ్చరణ ఎంతో కీలకమని చెప్పారు. నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మన బడి నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో మూడవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తరగతి గదులను పరిశీలించారు. ఎంఈఓ-2 బి.సురేష్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేసిన వలంటీర్



గన్నవరంరూరల్: మండలంలోని తెంపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ వీర్ల దుర్గాలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారు కుంభం రామారావుకు సోమవారం పెన్షన్ అందజేసింది. అనారోగ్యంతో రామారావు చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు. రామారావు ప్రభుత్వం తమకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రభుత్వానికి, సచివాలయం వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు. దుర్గాలక్ష్మిని సర్పంచ్ కొలుసు శిరీష, పంచాయతీ కార్యదర్శి మౌనిక, సచివాలయం కార్యదర్శి హర్షవర్ధిని, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



గన్నవరం: స్థానిక ఇస్లాంపేటకు చెందిన చిట్టూరి శ్యాంబాబుకు వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం శ్యాంబాబుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కెఎంఎంఏ కలాం, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ కరిముల్లా చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలాం మాట్లాడుతూ.. అనారోగ్య కారణాల వల్ల కొన్ని నెలలు క్రితం శ్యాంబాబు కుడి కాలును వైద్యులు తొలగించారన్నారు. అతని పరిస్థితిని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించినట్లు తెలిపారు. తమకు అండగా నిలిచిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు శ్యాంబాబు, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు షేక్ దాదా, ఎండీ అజ్గర్‌లాల్, ఎస్‌కే కరిముల్లా పాల్గొన్నారు.

ప్రణాళికతో విజయానికి పునాది

జూపూడి(ఇబ్రహీంపట్నం): విద్య, ఉద్యోగ అవకాశాల్లో చక్కని ప్రణాళికతోనే విద్యార్థులు అవకాశాలు పొందుతారని బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ హెచ్‌ఆర్డీ కన్సల్టెంట్ డాక్టర్ ఖాసిఫ్ రజాఖాన్ అన్నారు. జూపూడి నిమ్రా కళాశాలలో విద్యార్థుల భవిష్యత్ ప్రణాళిక, విద్యా, ఉద్యోగ అవకాశాలపై నిర్వహించిన సదస్సులో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఎంట్రన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూల్లో అవలంబించాల్సిన మెలకువలు తెలియజేశారు. ఖాసిఫ్ రజాఖాన్‌తో పాటు మొహిద్దీన్‌ను కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి సత్కరించారు. ప్రిన్సిపాల్స్ అక్బర్‌ఖాన్, జనార్దన్, ప్రొఫెసర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు అందజేత

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో సోమవారం పోలియో చుక్కలు వేయించుకుని చిన్నారుల వద్దకు వైద్య ఆరోగ్య సిబ్బంది వెళ్లి చుక్కలు వేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎ.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తెంపల్లి, బల్లిపర్రు, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, చిక్కవరం, చింతగుంట, బీబీగూడెం, గొల్లనపల్లి గ్రామాల్లో పరిశ్రమలు, ఊరికి దూరంగా ఉన్న పరిశ్రమల్లో పనిచేసే వారి వద్దకు వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మాదలవారిగూడెం ప్రాంతంలో ఉన్న ఇటుక బట్టీల వద్దకు వెళ్లి అక్కడ ఉన్న చిన్నారులకు ఏఎన్ఎం మేరీగ్రేస్ పోలియో చుక్కలు వేశారు.

జగనన్నకు అందరూ అండగా నిలవాలి

- మంత్రి జోగి రమేష్
- లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత
- పేదలను ఇంటి యజమానులు చేశాం



కానూరులో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్, నాయకులు

పెనమలూరు: త్వరలో జరగనున్న ఎన్నికల్లో జగనన్నకు అందరూ అండగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ కోరారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కానూరు, తాడిగడప గ్రామాలకు చెందిన 2,836 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను కానూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఖర్చుతో స్థలాల రిజిస్ట్రేషన్

ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారిని యజమానులను చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న పాదయాత్ర చేసిన సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు రాష్ట్రంలో దాదాపు 31 లక్షల మందికి పంపిణీ చేశారన్నారు. ప్రతిపక్షాలు కుట్ర పన్ని కోర్టు కేసులు వేసినా ప్రభుత్వం పోరాటం చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారికి పూర్తి న్యాయం చేసిందని తెలిపారు. ఇప్పుడు లబ్ధిదారులకు ఎలాంటి భారం లేకుండా స్థలాల రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వమే చేసిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, నేతలు దేవభక్తుని చక్రవర్తి, చాన్‌బాషా, సిద్ధిక్, అంగిరేకుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

రామవరప్పాడు: రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో 168 మందికి రిజిస్ట్రేషన్ పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. పేదల కష్టాలను తెలుసుకుని ఇటు సంక్షేమాన్ని అటు రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం జగన్‌పై టీడీపీ, జనసేన పార్టీలు విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. పేదలకు స్థలాలిచ్చి మంచి చేస్తుంటే నారా చంద్రబాబు నాయుడు కోర్టుకు వెళ్లి ఇబ్బందులు పెట్టడం పేదలపై ఉన్న కపట ప్రేమ తేటతెల్లమైందన్నారు. సంక్షేమ వారధులుగా నిస్వార్థంగా సేవ చేస్తున్న వలంటీర్లను చంద్రబాబు అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మీ వాడినంటూ కల్లబొల్లి మాటలు చెప్పి చీరలు, జాకెట్లు పంచిపెట్టి స్వార్థపూరిత టీడీపీ నాయకులను నమ్మవద్దన్నారు. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా మనందరం కలిసి గెలిపించుకోవాలన్నారు.



పట్టాలను అందజేస్తున్న గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, సర్పంచ్ పూర్ణ తదితరులు

టీడీపీ రాజకీయాలు దుర్మార్గం

గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. గ్రామంలో మొత్తం 789 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయన్నారు. మిగిలిన వారికి కూడా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి అతి త్వరలో పట్టాలను అందజేస్తామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మండల వ్యాప్తంగా ఎన్నో వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మేలు చేస్తుంటే టీడీపీ నాయకులు రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాసరావు, వీఆర్వో పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, మాదు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్తగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు రామిశెట్టి వెంకటేశ్వరరావు(ఆర్వీఆర్) పిలుపునిచ్చారు. స్థానిక విజయవాడరోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బూత్ కమిటీ, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామిశెట్టి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న విప్లవాత్మక పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఆ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వారికి గుర్తు చేయాలని చెప్పారు. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికైతేనే సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలు జరుగుతాయనే వాస్తవాన్ని ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, పార్టీ మండల అధ్యక్షుడు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడకల వీర్రాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారు

రామవరప్పాడు: మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ఇటు ఉన్నత విద్యతో పాటు అటు క్రీడలు, పారిశ్రామిక, రక్షణ, పరిశోధన వంటి అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. మహిళలను చిన్నచూపు చూడకుండా తగిన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సాధిస్తారని తెలిపారు. గైనకాలజిస్ట్ పావని మాట్లాడుతూ.. ఆత్మ విశ్వాసంతో మహిళలు ఎంతటి విజయమైన సొంతం చేసుకోవచ్చన్నారు. మహిళా సాధికారత, ఉన్నత విలువలు, హక్కులు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం మహిళా సాధికారత అంశంపై వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వసుంధర, శాంతి రెడ్డి, మహిళా కో ఆర్డినేటర్ నవత, ఈసీసీ హెచ్ఓడీ గౌరి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు తదితరులు

నేడు గొడవర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్యశిబిరం గొడవర్రు గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామ సచివాలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. నిపుణులైన వైద్యులు శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారన్నారు. శిబిరానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొంటారన్నారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మంచు తెరల్లో భానుడి తంటాలు

హిమవర్షం

పగటి వేళ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నా ఉదయాన్నే పొగమంచు కమ్మేస్తోంది. మంచు హిమవర్షంలా కురుస్తోంది. సన్నపాటి జల్లులతో మంచు తడిపేస్తుంది. ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రధాన రహదారులపై రాకపోకలు సాగించాల్సి వస్తుంది. మంచు వర్షపు జల్లులకు తడిచి ప్రకృతి ఆరాధకులు పులకరించిపోతున్నారు. సోమవారం ఉప్పలూరు పరిసరాల్లో కమ్మిన పొగమంచు దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

\- కంకిపాడు



ఉప్పలూరులో బుడమేరు వంతెనపై కమ్మిన పొగమంచు

జంక్షన్‌లో పారా మిలటరీ దళాల కవాతు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హనుమాన్‌జంక్షన్‌లో సోమవారం సాయుధ పోలీసు బలగాల కవాతు నిర్వహించారు. గన్నవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య నేతృత్వంలో పారా మిలటరీ దళాలు కాకాని కల్యాణ మండపం నుంచి ప్రధాన కూడలి, ఇందిరానగర్, గుడివాడ రోడ్డు, కేఎస్ టాకీస్ రోడ్డు మీదుగా కవాతు చేపట్టారు. హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి, ఎస్‌ఐలు ఏడీఎల్ జనార్దన్, ఆర్జమ్మ, ఎం.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

నున్నలో వైఎస్సార్ సీపీకే మొగ్గు

గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ



నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీకే మెజార్టీ అవకాశాలున్నాయంటూ టీడీపీ అభ్యర్థి బహిరంగంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. రానున్న ఎన్నికల కోసం గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన యార్లగడ్డ వెంకట్రావ్ తన ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి నున్న గ్రామానికి వచ్చారు. గ్రామంలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, పార్టీలో చేరికల కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నున్న గ్రామం వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసినప్పుడు ఇదే గ్రామంలో గడప గడపకు వెళ్ళి ఓట్లు అడిగానన్నారు. ఆ సందర్భంలో గ్రామస్తులు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓట్లు వేయడంతో తనకు ఇక్కడ 304 ఓట్లు మెజార్టీ వచ్చిందన్నారు. ఆ విధంగా నున్న గ్రామం వైఎస్సార్ సీపీ కే అనుకూలమనే వాస్తవాన్ని యార్లగడ్డ అంగీకరించినట్లయింది. తాను ఏనాడూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించలేదని, ఎన్టీ రామారావు అధికారంలో ఉండగా అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ అమలవుతున్నాయని చెప్పడం విశేషం. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

గన్నవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన గన్నవరంలో పర్యటించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో పలు రహదారులను అభివృద్ధి చేయగా, మిగిలిన రోడ్ల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే వంశీమోహన్‌ను కలిశారు. ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, జెడ్పీటీసీ సభ్యులు కాకర్లమూడి సువర్ణరాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని బాబీ, నాయకులు పాల్గొన్నారు.



టీ స్టాల్ వద్ద పార్టీ నాయకులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

పెనమలూరు: పోరంకి శ్రీనివాసనగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిర 29వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, బాబా మంగళస్నానం, 6.30 గంటలకు దోనేపూడి దుర్గా ప్రసాద్ దంపతులచే 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు. తుమ్మలపల్లి హరికృష్ణ దంపతులచే పళ్ల రసంతో స్నపన, విశేష అలంకరణ, విష్ణు సహస్రనామ పారాయణం, జొన్నలగడ్డ సురేష్ దంపతులచే తులసిదళ పూజలు, సాయిరామ్ దంపతులచే వెండి మారేడు దళాలతో విశేష అర్చన చేశారు. అనంతరం అన్నాభిషేకం పూజలు, పాదుకా ఉత్సవం, పతాకావిష్కరణ, భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరించారు. కార్యక్రమాలను సాయిబాబా మందిర అధ్యక్షుడు మున్నంగి అర్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



సాయిబాబాను దర్శించుకుంటున్న మంత్రి జోగి రమేష్

మహాశివరాత్రి ఉత్సవాలు సమర్థంగా నిర్వహించాలి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలను సమర్థంగా నిర్వహించాలని ఆర్డీఓ డి.రాజు ఆదేశించారు. గ్రామంలో దేవస్థానం కల్యాణ మండపంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ.. మహాశివరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తాగునీరు, వైద్యం, పారిశుద్ధ్యం, శాంతిభద్రతలు పర్యవేక్షించాలని ఆదేశించారు. కొండపై దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. నదీ స్నానం చేసే భక్తులకు ప్రమాదాలు జరగకుండా ఉండటానికి గజఈతగాళ్లను, బోట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రభోత్సవంలో ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవదాయ, ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ కుమార్‌బాబు, సీఐ రామారావు, ఎస్ఐ ఏసోబు, ఏఓ లోయ శివశంకర్, వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్‌రావు, తాడిగడప అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునరావు, ఆలయ ఈఓ గంగాధరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



యనమలకుదురులో ప్రసంగిస్తున్న ఆర్డీఓ రాజు

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పెనమలూరు: యనమలకుదురులో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి చికిత్స పొందుతున్న భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడు నెహ్రూనగర్‌కు చెందిన దుంపల విష్ణుమూర్తి(30) యనమలకుదురులో కొండారెడ్డి అనే మేస్త్రీ వద్ద తాపీ పనికి శనివారం వచ్చాడు. అతను అపార్టుమెంట్‌లో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి భవనంపై నుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలు అవ్వటంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న అతను ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య దుంపల కుమారి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.



విష్ణుమూర్తి మృతదేహం

నేడు హనుమాన్‌జంక్షన్ బస్‌స్టేషన్ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో రూ.4.40 కోట్లతో నిర్మించిన ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను మంగళవారం ప్రారంభించనున్నారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు, జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హాజరుకానున్నారు. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ప్రారంభోత్సవానికి సన్నాహాలు పూర్తి చేశారు. 1966లో నిర్మించిన ప్రస్తుత బస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకోవటంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.4.40 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. 1.23 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్ నూతన భవన సముదాయాలను నిర్మించారు. నూతన బస్టాండ్‌లో పది ప్లాట్‌ఫాంలతో పాటుగా కంట్రోలర్ కార్యాలయం, ఎంక్వైరీ కౌంటర్, బస్ పాస్ కౌంటర్, డ్రైవర్ల విశ్రాంతి గది, ఎనిమిది షాపులు, హోటల్, కొరియర్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. రోజుకు వెయ్యికు పైగా బస్సుల రాకపోకలు, 5 వేల మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ బస్‌స్టేషన్ బహుళ ప్రయోజన కేంద్రంగా రూపొందించారు.



హనుమాన్‌జంక్షన్ బస్‌స్టేషన్

నేడు 'ఉపాధి' ప్రజావేదిక

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.9.71 కోట్లతో చేపట్టిన పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన నివేదికలపై ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ మెట్‌లు, కూలీలు పాల్గొనాలని కోరారు.

పోయినది

షేక్ జామీర్‌బాషా S/o. షేక్ బాజీ నసత్‌నగర్, పెద్దమసీదు రోడ్డు, డోరు నెం. 15-225/1 వారికి సంబంధించిన డాక్యుమెంట్స్ & లింకు దస్తావేజులు నెంబర్స్ 3538/2013, 5624/2007, 4504/2011, 5376/2012 జిరాక్స్ షాపుకు వెళ్ళి తిరిగి వస్తుండగా ఒరిజినల్స్ డాక్యుమెంట్స్ & లింకు దస్తావేజులు పోయినవి ఎవరికైనా దొరికిన వారు క్రింది నెంబరును సంప్రదించి అందజేయగలరు.
☏ 93983 77759, 81219 90545.

టీడీఎస్ నిబంధనలపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఐరన్ యార్డ్‌లోని ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం టీడీఎస్ నిబంధనలపై వ్యాపారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ అధికారి కెఎస్ఎన్ రాము మాట్లాడుతూ టీడీఎస్ నియమ నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం వలన పన్ను మినహాయింపుదారులు వివిధ డిఫాల్ట్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఫలితంగా టీడీఎస్ రిటర్న్‌ల ప్రాసెసింగ్‌పై అనవసరమైన డిమాండ్లు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పర్యవసానంగా జరిమానాలు, చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి చర్యలను నివారించేందుకు ప్రతి వ్యాపారస్తుడు టీడీఎస్ నిబంధనల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. సదస్సుకు హాజరైన అసోసియేషన్ సభ్యులు తమ సందేహాల గురించి అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రం రమణయ్య, సెక్రటరీ కొనకళ్ల సూర్య శంకర్, ఆడిటర్ రాఘవులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ రాము